## గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్టు



ముగ్గురిని అరెస్ట్ చేసి వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

**శంకర్‌పల్లి, జనవరి 17 ప్రభాతవార్త:** నిషేధిత గంజాయిని తరలిస్తుండగా ముగ్గురిని మోకిల పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డు మీదుగా నిషేధిత గంజాయిని తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు ఉదయం ఆరు గంటల సమయంలో ఇంద్రారెడ్డి నగర్ గ్రామం వద్ద ఇద్దరు మగ, ఒక మహిళ గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నట్లు మోకిల పోలీసులు తెలిపారు. వీరి నుంచి 44 కేజీల బరువు ఉన్న మొత్తం 22 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముగ్గురిని అదు పులోకి తీసుకున్నట్లు తెలిపారు. అరెస్టు అయిన ముగ్గురు నిందితులు గంజానన్ సుభాష్ మోహితె (23), గోవింద ధారాసింగ్ జాదవ్ (20), శిల్లా గంజానన్ మోహితె (21)లు మహారాష్ట్రకు చెందిన వారుగా గుర్తించారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్



వార్త

## విజేతలకు బహుమతులు అందజేత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న క్యామ మల్లేష్

**ఆదిభట్ల జనవరి17,ప్రభాతవార్త:** యువతి, యువకులు క్రీడా రంగంలో రాణించాలని పలువురు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని శేరిగూడ గ్రామంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కంబాలపల్లి సురేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రో కబడ్డీ లీగ్ బుధవారంతో ముగిసింది. సీనియర్, జూనియర్ రెండు విభాగాలుగా జరిగిన ఈ కబడ్డి లీగ్‌లో విజేతలకు క్యామ మల్లేష్ బహుమతులు అందజేశారు. మొద్దు వెంకటరెడ్డి,కొంగర జంగయ్య కంబాలపల్లి మహేష్,నరుకుడి భాస్కర్, కొప్ప భాస్కర్,నరకుడు సురేష్,చిత్రం కుమార్,తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

## ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసింది బిఆర్‌ఎస్సే

**కోటపల్లి ప్రాజెక్టుకు పూర్వవైభవం తెచ్చేందుకు కృషి**

**అవినీతి, అక్రమాలను ప్రోత్సహించే ప్రసక్తే లేదు**

**తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి**

**పెద్దేముల్, జనవరి 17, ప్రభాతవార్త:** ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన ఘనత బిఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో యంపిపి టి,అనురాధరమేష్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గత ప్రభుత్వం కోటపల్లి ప్రాజెక్టులో గంపెడు మట్టి తీసిన పాపానా పోలేదని, తద్వార 9200 ఎకరాల ఆయకట్టుకు నీరందవలసి ఉండగా కేవలం 3 వేల ఎకరాలకే సాగునీరందడం సిగ్గుచేటని విమర్శించారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ. 135 కోట్లతో కోటపల్లి ప్రాజెక్టును, కాలువలను పునరుద్ధరించి ప్రాజెక్టుకు పూర్వవైభవం తీసుకొచ్చేల కృషి చేస్తానని అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పక అమలు చేసి తీరుతామని అన్నారు. అనుమతులు లేకుండా సుద్ద తవ్వకాలు, ఇసుక రవాణ, మట్టి రవాణ, భూకబ్జాలకు పాల్పడితే ఉపేక్షించేదిలేదని, అవినీతికి, అక్రమాలను ప్రొత్సహించే ప్రసక్తేలేదని తేల్చిచెప్పారు, ప్రస్తుతం కొనసాగుతున్న సమావేశంలో ప్రజాప్రతినిధులు విన్నవించిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషిచేయాలని, లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశానికి ఆయా శాఖలకు సంబందించిన అధికారులే రావాలని, ఎవరు పడితే వారు వస్తే ఊరుకునే ప్రసక్తేలేదని అన్నారు. జెండా ఎజెండా తెలియని ఆయా శాఖకు సంబందించిన కింది స్థాయి అధికారులు వస్తే మీరు ఎం చేస్తున్నారని యంపిడిఓ లక్ష్మప్పపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇకముందు ఇలాంటి పొరబాట్లు లేకండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. జడ్‌పిటిసి ధారాసింగ్ అధ్వర్యంలో నిర్వహించే క్రీడల పోటిలకు ఆయా గ్రామాల విద్యార్థులు పాల్గొనేందుకు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు కృషిచేయాలని అన్నారు. తాను పార్టీలకతీతంగా పని చేస్తానని, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తట్టెపల్లి పిఏసిఎస్ చైర్మెన్ పి.లక్ష్మారెడ్డి, వైస్ యంపిపి మధులతశ్రీనివాస్, కోటపల్లి మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ కొమ్ము మాణెమ్మ,తహసిల్దార్ కిషన్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, యంపిటీసీల ఫోరం అధ్యక్షుడు ధన్‌సింగ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, యంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలి.

## కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులందరిని పర్మిమెంట్ చేయాలి

**16న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి**

**సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్**



వినతి పత్రం ఇస్తున్న అల్లి దేవేందదర్, తదితరులు

**చేవెళ్ల, జనవరి 17 ప్రభాతవార్త :** కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి,కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులందరిని పర్మిమెంట్ చేయాలని సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. ఫిబ్రవరి 16న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని మణికొండ మున్సిపల్ కమీషనర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ 16న దేశ వ్యాప్త సమ్మెను జాయింట్ ప్లాట్ ఫారం ఆఫ్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. గతంలో మున్సిపాలిటీ కార్మికుల సమస్యలపై అనేకమార్లు సమ్మెలో ధర్నాలు, వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. గత ప్రభుత్వాలు ఏ మాత్రం పట్టించుకోలేదని, ఈ మధ్య కాలంలో కొత్తగా ఏర్పాటు అయినటువంటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మున్సిపాలిటీ కార్మికులందరికీ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని మున్సిపాలిటీ కార్మికులకు ఎలాంటి ఇన్సూరెన్స్ సౌకర్యం లేక రోజువారి పనులు చేస్తూ అనారోగ్యానికి గురి అయ్యే చాలామంది కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని ప్రభుత్వం సంస్థలను ప్రైవేటు పరం చేసినటువంటి కేంద్ర ప్రభుత్వం మానుకుని ప్రభుత్వాస్థలన్నీ ప్రభుత్వ ఆధీనంలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులందరూ దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మణికొండ సిఐటీయూ మున్సిపాలిటీ కార్మికులు టి. చంద్రశేఖర్, విజయ్, వరలక్ష్మి,జయశ్రీ పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

**మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 17, ప్రభాతవార్త** డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి అర్హులకు అందజేయాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లపై పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి, గ్రేటర్ సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగ కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగ నిర్మాణంలో ఉన్న డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల పనులను త్వరగా పూర్తి చేసి లబ్దిదా రులకు అందించటానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లలో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆయన ఆదేశించారు. గతంలో అందజేసిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల గురించి, నిర్మాణంలో ఉన్న అవి ఏ పరిస్థితిలో ఉన్నాయని వాటి గురించి ఆరా తీశారు. ఆర్‌అండ్‌బి ఈఈ శ్రీనివాస్‌మూర్తి, రెవెన్యూ డివిజన్ అధికారుల ను, మండలాల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండ పెండింగ్‌లో ఉన్న వాటిని పూర్తి చేయాలన్నారు. ఆయా మున్సిపాల్టీలు, మండలాల వారీగ మంజూరైన లబ్దిదారులకు అందజేయాలని అన్నారు. వీటికి సంబంధిత జిహెచ్‌ఎంసి (డెత్ కేసు) లబ్దిదారుల ఫోన్‌నెంబర్లతో నాట్ ట్రెసబుల్, రిజర్వేషన్ కల్పించిన వారికి కులం సర్టిఫికెట్ జారీ పెండింగ్ ఉండటం వంటి కొన్ని సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. డెత్ కేసులలో లబ్దిదారుల కుటుంబ సభ్యులను సంప్రదించి స్పౌజ్ కాని వారి పిల్లల్లో ఒకరి పేరును కుటుంబ సభ్యులందరి సమక్షంలో నిర్ణయించి లిఖితపూర్వకంగ ఆమోదపత్రం పొంది వారి పేరుపై డబుల్‌బెడ్ రూమ్ పట్టా సర్టిఫికెట్ అందజేయటానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. నాట్ ట్రెస బుల్ కేసులలో ర్యాండమైజేషన్ ఫారం-32లో అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం లబ్దిదారులను గుర్తించాల్సిందిగ అధికారులకు వివరించారు. వారి కుల ధృవీకరణ పత్రాలను కూడ తహసీల్దార్లను, ఆర్డీవోలను త్వరగా జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బి ఈఈ శ్రీనివాస్‌మూర్తి, ఆర్డీవోలు, జిహెచ్‌ఎంసి ఇంజనీర్లు, ఆయా మండలాల తహసీలార్లు, ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గౌతమ్, పాల్గొన్న అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శశాంక

## అధికారులు సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్ శశాంక

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదారాబాద్, జనవరి 17 ప్రభాతవార్త :** అధికారులు రోడ్డు విస్తరణ సమస్యను పరిష్కరించడంలో సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశించారు. బుధవారం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎల్బీనగర్ నుండి మల్కాపూర్ వరకు ఆరులైన్ల రోడ్డు విస్తరణ కోసం సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ శశాంక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎల్బీనగర్‌లోని ఎన్‌హెచ్ 65లోని మహవీర్ హరిణి వనస్థలి పార్క్(డీర్‌పార్క్) వద్ద కెఎం 15 నుండి 40కెఎం జరగాల్సిన జాతీయ రహదారి మరమ్మతుల కోసం, ఆరులైన్‌ల సర్వీస్ రోడ్ల విస్తరణ సమస్యను పరిష్కరించడానికి భూమిని సేకరించడంలో సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారులు సుధా కర్‌రెడ్డి, జిల్లా జాతీయ రహదారి రోడ్ అండ్ బిల్డింగ్ ఈఈ ధర్మారెడ్డి,ఇబ్రహింపట్నం ఆర్డీవో అనంతరెడ్డి,తహసీల్దార్లు,జిల్లా సర్వేలాండ్ ఏ.డి శ్రీనివాస్, సంబందిత అధికా రులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి వర్గంలో మనోడు!

### కాంగ్రెస్ శ్రేణుల్లో అభిమానుల్లో కొత్త జోష్



ఫోటో గోదాదేవి కళ్యాణమహోత్సవంతో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అనురాధ దంపతులు (ఫైల్)

**నందిగామ, జనవరి 17, ప్రభాతవార్త:** ఆపదలో తలుపు తడితే నేనున్నానని భరోసా ఇస్తూ సత్వరమే స్పందించే వ్యక్తిత్వం ఉన్న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి క్యాబినెట్లో మంత్రిగా చోటు దక్కునుందనే పుకార్లు నందిగామ మండలంలో షికారులు కొడుతున్నాయి. సిఎం రేవంత్‌రెడ్డితో వీర్లపల్లి శంకర్‌కు అత్యంత సాహిత్యం ఉందనడంలో ఎంత మాత్రం అతిశక్తిలేదు. పార్టీ అధికారంలోకి రాకముందు పార్టీ పరంగా రంగారెడ్డి జిల్లాలో రేంత్‌రెడ్డి ఏ పని అప్పజెప్పిన శంకర్ బాధ్యతతో క్షమ శిక్షణతో చేసేవారనే నమ్మకం, విశ్వాసం నాటుకుపోయింది. పదేళ్లుగా షాద్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పారీ పునర్జీవనం పోయడంలో శంకర్ కీలకపాత్ర పోషించారు. నియోజకవర్గంలో బలంగా ఉన్న బిఆర్‌ఎస్ ను ఓడించి ఎమ్మెల్యే సీటును కైవసం చేసుకోవడంతో వీర్లప ల్లి శంకర్‌పై సిఎం రేవంత్‌రెడ్డికి మరింత అభిమానం నమ్మకం విశ్వాసం పెరగిందనే విషయం ప్రతి ఒక్కరికి తెలిసిన విషయమే. కాగా అనునిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజలే బలం బలగం అని భావించే వీర్లపల్లి సామాజిక సేవా కార్యక్రమాల్లో రాణిస్తూనే నియోజకవర్గం ప్రజల కు సేవకుడిలా పనిచేస్తూ అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లలా భావించి ప్రజల ఆధారాభిమానాలు చూరగొన్నా రు. కాగా రెండు రోజులక్రితం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని కొత్తూరు మాజీ జెడ్పిటిసి మామిడి శ్యాంసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అనంత పద్మనాభస్వామి దేవాలయంలో నిర్వహించిన గోదాదేవి కళ్యాణ మహో త్సవంలో ఎమ్మెల్యే సతీసమేతంగా పాల్గొని పూజలు చేశారు. రజిక సామాజిక వర్గానికి చెందిన వీర్లపల్లి శంక ర్‌ను సిఎం రేవంత్‌రెడ్డి మంత్రి వర్గంలోకి తీసుకోనున్న ట్లు సంకేతాలు వినిపించడంతో కాగ్రెస్ శ్రేణుల్లో నాయకుల్లో అభిమానుల్లో కొత్త జోష్ నెలకొంది. పదవి దక్కుతుందని భావించి కాంగ్రెస్ కార్యకర్తలు విందు వినోదా



కబడ్డీ విజేతలకు బహుమతులు అందిస్తున్న నాయకులు

## ముగిసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

**కొడంగల్ రూరల్, జనవరి 17 (ప్రభాత వార్త):** యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు బుధవారంతో ముగిశాయి. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గత మూడు రోజులుగా కొడంగల్ పట్టణంలోని ఎస్బిఐ బ్యాంకు ముందు సిటిజన్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో మొత్తం 40 జట్లు పాల్గొన్నాయి. పోటీల్లో క్రీడాకారులు హోరాహోరిగా తలపడ్డారు. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కొడంగల్ జట్టు విజయం సాధించింది. గెలుపొందిన జట్టుకు రూ.50వేలు, రన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ.30వేలు, తృతీయ స్థానంలో నిలిచిన కిష్టాపూర్ జట్టుకు రూ.20వేలు, నాలగవ బహుమతి గోల్డెన్ బేకరి జట్టుకు రూ.10వేలు నగదుతో పాటు ట్రోఫీలను యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, తాలూకా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ ఎన్గల భాస్కర్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నయీం, నాయకులు భీమారాజు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు తార్యానాయక్ విజేతలకు బహుమతులు అందించారు.



దుద్యాలలో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

## పేదల గుడిసెలపై ప్రభుత్వ దౌర్జన్యం నశించాలి

**సిపిఎం జిల్లా కార్యవర్గసభ్యులు బుస్స చంద్రయ్య**

**బొంరాస్‌పేట్, జనవరి 17, ప్రభాతవార్త:** పేదల గుడిసెలపై రాష్ట్ర ప్రభుత్వం దౌర్జన్యం నశించాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులుబుస్స చంద్రయ్య ఆరోపించారు. బుధవారం దుద్యాల మండల కేంద్రంలోని బస్‌స్టాండ్ ఆవరణలో అంబేద్కర్ విగ్రహం ముందు సిపిఎం పార్టీ అధ్వర్యంలో నిరసన వ్యక్తంచేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో వీరనారి ఐలమ్మనగర్ నందు గత ఆరు నెలలుగా పేదలు, కార్మీకులు ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని పట్టాలు ఇవ్వాలని పోరాడుతున్నారు. ఈ నెల 16 తెల్లవారు జామున మూడు గంటల ప్రాంతంలో వందలాది మంది పోలీసులతో బుల్‌డోజర్లతో గుడిసెలను కూల్చివేసారు. పేద ప్రజ లను భయభ్రాంతులకు గురిచేసి ముఖ్యమైన నాయకులైన లెల్లెల బాలక్రిష్ణతో పాటు 20 మందిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బుస్స చంద్రయ్య మాట్లాడుతూ యంపిలు, ఎమ్మెల్యేలు ప్రభుత్వ భూములను, కుంటలను కబ్జాచేసి అమ్ముకుంటే వారిని అరెస్టు చేయకుండా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తు దుద్యాల మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాములు, వెంకటయ్య, మొగులయ్య, సాయులు, అనంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ గురుకుల పాఠశాల,జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలి

**జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కె.నవీన్‌రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదారాబాద్, జనవరి 17 ప్రభాతవార్త :** మైనార్టీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కె.నవీన్‌రెడ్డి బుధవారం ఆయన ఒక ప్రకటన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జిల్లాలో హయత్‌నగర్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, బాలాపూర్(బాలుర), ఇబ్రహింపట్నం, రాజేంద్ర నగర్, హయత్‌నగర్, ఫరూఖ్‌నగర్, మొయినాబాద్ (బాలికల) మొదటి సంవత్సరం ఎంపిసి,బైపిసి, హెచ్‌ఈసి, సిఈసి గ్రూపుల్లో,5వ తరగతిలో ప్రవేశాల కొరకు, 6,7,8వ తరగతి బ్యాక్ లాగ్ ఖాళీలను(మైనార్టీలకు మాత్రమే) భర్తీ చేస్తున్నామన్నారు. అర్హులైన మైనార్టీ విద్యార్థులు 2024,25 విద్యా సంవత్సరానికి దరఖాస్తులను 06.02.2024లోగా చేసుకోవాలని తెలిపారు.

జిల్లాలోని గురుకుల జూనియర్ కళాశాలలో ప్రవేశం కోసం మైనారీ (ముస్లీం, క్రైస్తవ,పార్సి,జైన్స్,బుద్దిస్ట్) విద్యార్థులకు 75 శాతం సీట్లతో పాటు నాన్ మైనార్టీలకు(ఎస్సీ,ఎస్టీ,బీసీ ఇతరులకు) 25శాతం రిజర్వేషన్ ఉందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్ వెబ్ సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

## షాద్‌నగర్ మున్సిపల్ అభివృద్ధికి కృషి

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**మున్సిపల్ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరు**

**షాద్‌నగర్, జనవరి 17, (ప్రభాతవార్త) :** షాద్‌నగర్ మున్సిపల్ అభివృద్ధికి తన వంతు సహాయాకారాలు ఎల్లప్పుడు ఉంటాయని, ప్రభుత్వం నుంచి మంజూరు కావాల్సిన నిధులు సహితం త్వరగా విడుదల అయ్యే విధంగా చూస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత బుధవారం మొదటి సారి నిర్వహించిన షాద్‌నగర్ మున్సిపాల్ సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅథితిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ నరేందర్, కమీషనర్ వెంకన్నలు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం ప్రారంభమైన సర్వసభ్య సమావేశంలో పలువురు కౌన్సిలర్లు, మెంబర్లు తమ వార్డులోని సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన అధికారులు, మున్సిపల్ ఛైర్మన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా కౌన్సిల్ ప్రవేశ పెట్టిన 48 తీర్మాణాలను అందరు ఏకగ్రీవంగా తీర్మాణించారు. ముఖ్యంగా మున్సిపల్ కార్యాలయంలో ఆధార్‌సెంటర్‌కు ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ... రాజకీయాలకు అతీతంగా అందరం కలిసికట్టుగా పట్టణ మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకుందామని ఆయన అన్నారు. మున్సిపల్ అభివృద్ధి చెందాలి అంటే అందరం కలిసిమెలిసి పనిచేస్తేనే సాధ్యమవుతుందని, తెలిసి తెలియక ఏమైనా పొరపాట్లు జరిగితే వాటిని సరిదిద్ది ప్రజల క్షేమం కోసం చర్యలు తీసుకుందామని అన్నారు. మున్సిపల్ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను సహితం త్వరగా మంజూరు చేయించేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్ నటరాజన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మెళ్లగూడలో నూతన గ్రామపంచాయతీ భవనం ప్రారంభం

ఫరూఖ్‌నగర్ మండలంలోని మెళ్లగూడ గ్రామ పంచాయతీలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని బుధవారం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅథితిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ... ప్రజల అభిష్టం మేరకు పాలన కొనసాగించడానికి ఈ గ్రామ పంచాయతీ భవనాలు ఎంతగానో ఉపయోగపడుతాయని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ అని ఇచ్చిన హామీలను నేరవేర్చాడానికి పార్టీ కట్టుబడి ఉంటుందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నేరవేర్చుతామని ఆయన తెలిపారు. గత బీఆర్‌ఎస్ పార్టీ పదేళ్లపాటు గ్రామ పరిపాలనను నిర్వీర్యం చేసిందని ఆయన విమర్శించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి సరియైన నిధులు మంజూరు చేయక అటూ సర్పంచులను, ఇటూ గ్రామస్థులను ముప్పు తిప్పలు పెట్టారని ఆయన ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, ఎంపీడీఓ విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు గ్రామస్థులు, గ్రామ సర్పంచి తదితరులు పాల్గొన్నారు.

### మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన

మండల పరిధిలోని నాగులపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ నిధులు రూ.10లక్షలతో మహిళా సమాఖ్య భవనాన్ని ఏర్పాటు చేయడానికి బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మహిళల అభివృద్ధికి పెద్ద పీఠ వేసిందని, మహిళలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రమైన, దేశమైనా అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాగులపల్లిలో మహిళ సమాఖ్య భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

## తెలంగాణ ఉద్యమకారుడు మురళీధర్ మృతి తీరని లోటు



మురళీధర్‌కు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

**ఎమ్మెల్యే పద్మారావు గౌడ్**

సికింద్రాబాద్, జనవరి 17 ప్రభాతవార్త: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన బౌద్ధనగర్ డివిజన్‌కు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, యంజాల మురళీధర్ కుటుంబ సభ్యులను సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ బౌద్ధనగర్‌లోని మురళీధర్ నివాసం వద్ద ఏర్పాటు చేసిన చిత్రపటానికి నివాళులు అర్పించి ఆయన సేవలను కొనియాడారు. తనకు తెలంగాణ ఉద్యమ సహచరుడని, మురళిని కోల్పోవడం బాధాకరమన్నా పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**బీఆర్ఎస్ నాయకులు రవికుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించిన తలసాని శ్రీనివాస్ యాదవ్**
బన్సీలాల్‌పేట్ డివిజన్ గాంధీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్ కుటుంబ సభ్యులను మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. ఇటీవల మరణించిన రవికుమార్ దశదిన కర్మను బుధవారం కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తలసాని శ్రీనివాస్ యాదవ్ రవికుమార్ చిత్రపటానికి పూల సమర్పించి నివాళులు అర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ప్రేమ్‌కుమార్, కుమార్ యాదవ్, రాజేందర్, చిన్న, రమేష్ తదితరులు ఉన్నారు.

## ఫతేనగర్‌లో గోశాల ప్రారంభం



గోశాలను ప్రారంభిస్తున్న రాజేశ్వరరావు

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 17, ప్రభాతవార్త : బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు బిజెపి ఆధ్వర్యంలో గతంలో కూకట్‌పల్లి నియోజవర్గంలో చేపట్టిన పాదయాత్రలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. తనసొంత నిధులతో ఫతేనగర్ డివిజన్‌లోని దీన్‌దయాల్ నగర్‌లో గల వంద ముఖి హను మాన్ దేవాలయం లో ఏర్పాటు చేసిన గోశాలను బుధవారం రాజేశ్వరరావు ప్రారంభించారు. గతంలో ఫతేనగర్ డివిజన్ బిజెపి భరోసా యాత్ర నిర్వహిస్తున్న సమయంలో దీన్‌దయాల్ నగర్ కాలనీ వాసులు, ఆలయ కమిటీ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావుని గోశాల నిర్మాణానికి తనవంతు సహకారం అందించాలని కోరారు. గోశాల నిర్మాణానికి అయ్యే వ్యయాన్ని పూర్తిగా తానే అందిస్తానని తెలిపి ఇచ్చిన మాట ప్రకారం నిర్మాణం పూర్తి చేశారు. బుధవారం వేదపండితుల ఆధ్వర్యంలో గోశాలను ప్రారంభించిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆలయ కమిటీ నిర్వాహకులు సాయిలు యాదవ్, శ్రీనివాస్ యాదవ్, కుమార్‌గౌడ్, అశోక్ కుమార్, భవానీ నగేష్, విజయ్ భాస్కర్‌రెడ్డి, మీనా, మల్లేశ్‌యాదవ్, మల్లేశ్, దుర్గయ్య, రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : ఎమ్మెల్యే లాస్య



7వ వార్డు తిరుమలగిరి ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే లాస్య నందిత తదితరులు

కంటోన్మెంట్, జనవరి 17 ప్రభాతవార్త: కంటోన్మెంట్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు బస్తీ దావఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే లాస్య నందిత సూచించారు. బుధవారం 7వ వార్డులోని తిరుమలగిరిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదలకు డాక్టర్లు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలన్నారు. ఆరోగ్య కేంద్రంలో ఏమైనా సమస్యలు ఉంటే తనదృష్టికి తెచ్చినట్లు అయితే సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.పి.హెచ్.ఓ. డాక్టర్ రాజకుమారి, బిఆర్ఎస్ నాయకులు నివేదిత, మాజీ బోర్డు సభ్యుడు శ్యామ్‌కుమార్, తేజ్‌పాల్, కె.బి.శంకర్, మధు, వేణు, యశ్వంత్, మర్టిన్, రాజిరెడ్డి, పద్మ సంతోష్, ఓదెల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

నార్సింగి, జనవరి 17 ప్రభాతవార్త : కరెంటు వైర్లకు అడ్డుగా వచ్చిన చెట్ల కొమ్మలు తొలగించడం వలన నేడు ఈ క్రింది ప్రాంతాలలో కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నామని గంధంగూడ సబ్‌స్టేషన్ ఏఈ పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10.గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గంధంగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యానగర్, శివపురి, శివసాయి నగర్, సంజయ్ గాంధీ నగర్, గంధంగూడ, ఇండస్ వ్యాలీ, లిబ్డమ్ విల్లాస్, సన్‌సిటీ, బైరాగిగూడ, పావని పెటల్స్, కెకె గార్డెన్, కెకె.నగర్, రాధానగర్ ఫేజ్-2, రఘురాంనగర్, రాధానగర్, సాయిబాలాజీ నగర్, కెకె-1, కేకే-2, వెంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రశాంత్‌నగర్, బృందావన్ కాలనీ, నర్సారెడినడ కాలనీ, పద్మశ్రీహిల్స్, తిరుమల గార్డెన్, పావనీ హార్మోని విల్లాస్ ప్రాంతాలలో నేడు కరెంటు సరఫరాను నిలిపి వేస్తున్నామని, ఇందుకు విద్యుత్ వినియోగదారులంతా సహకరించాలని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

**జీడిమెట్ల..** కొమ్మలు నరికివేత కారణంగా నేడు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జీడిమెట్లలోని పలు ప్రాంతాలలో విద్యుత్ ఆపివేయబడుతుందని జీడిమెట్ల ఏఈ పిఠ పి.ప్రసూన తెలియజేశారు. 33/11 కెవి జీడిమెట్ల ఎస్ఎస్1 నుండి వెలవడే 1.11 కెవి రైతు బజార్ ఫీడర్‌లో షాపూర్‌నగర్ మార్కెట్, షాపూర్ నగర్ ప్రధాన రోడ్డు ప్రాంతాలలో విద్యుత్‌కు అంతరాయం కలిగినందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

## శబరిమలకు బయలు దేరిన స్వాములు



మణికొండ శివాలయంలో
ఇరుముడులు కట్టుకొని శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు

నార్సింగి, జనవరి 17 ప్రభాతవార్త : 40 రోజుల పాటు కఠినమైన దీక్షలు చేసిన అయ్యప్ప స్వాములు మంగళవారం మణికొండ శివాలయం నుంచి శబరిమలకు ఇరు ముడులు కట్టుకొని బయలుదేరి వెళ్లారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు శివాలయం అయ్యప్ప నామ స్మరణంతో మారుమ్రోగిపోయింది. గురుస్వాముల కరకమలముల మీదుగా శాస్త్రోక్తగంగా ఈ కార్యక్రమం జరిగింది. అయ్యప్ప స్వాములు, భక్తులు అందరూ హారిహార తనయుడిని స్తుతిస్తూ ఆలపించిన భక్తిగీతాలు అందరిని భక్తిసాగరంలో ముంచెత్తాయి. ఈ సందర్భంగా మణికొండ మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొండకల్ల నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కొలిచిన భక్తుల కోర్కెలు తీరుస్తున్న మణికంఠ స్వామికి ఏటాటే మాలలు వేసే భక్తుల సంఖ్య పెరుగుతూనే ఉందన్నారు. కటిక నేలపై పవళిస్తూ, ఒంటిపూట భోజనం చేస్తూ, నిరంతరం అయ్యప్ప నామ స్మరణం చేస్తూ స్వా ములు మండల దీక్షలు చేసి, మహిమాన్విత అయ్యప్ప కరుణా కటాక్షాలకు పాత్రులవుతున్నార న్నారు. అయ్యప్ప మాలలు వేసినా, నామ స్మరణం చేసినా కలి ప్రభావం నుంచి తప్పించుకోవచ్చని నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి ప్రభాకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, రాంచంద్రారెడ్డి, శ్రీను, నిఖిల్, రాజు, మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు బీరప్ప, కౌన్సిలర్ శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, రవి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## గుర్తు తెలియని మహిళ మృతదేహం

మూసాపేట, డిసెంబర్ 17, ప్రభాతవార్త: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సబ్‌ఇన్స్‌పెక్టర్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధి వై జంక్షన్ దగ్గర మెట్రో పిల్లర్ నెంబర్ 868, 869 మధ్యలో సుమారు 60 ఏళ్ళ మహిళ (60) మృతదేహం పడి ఉండడంతో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారించగా ఆమె యాచకురాలు అని తెలిసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సబ్‌ఇన్స్‌పెక్టర్ రామకృష్ణ తెలిపారు.

## సిబిటి కంప్యూటర్ బెస్ట్ టెస్ట్ వన్ టైమ్ ఛాన్స్‌ను విద్యార్థులు వినియోగించుకోండి

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 17, ప్రభాతవార్త : సిబిటి కంప్యూటర్ బెస్ట్ టెస్ట్ ఒన్ టైమ్ ఛాన్స్‌ను విద్యార్థులు అందరూ ఉపయోగించుకుని విద్యార్థులు వారి వారి కోర్సులు పూర్తి చేసుకోవాలని జెఎన్‌టియు యూనివర్సిటీ పరీక్ష విభాగం డైరెక్టర్ డాక్టర్ కె.వెంకటేశ్వర్‌రావు ఓ ప్రకటనలో తెలియజేశారు. కంప్యూటర్ బెస్ట్ పరీక్ష బివిఆర్ఐటి ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో ఎంజిఐటి ఇంజనీరింగ్ కాలేజీలోను, మహావీర ఇంజనీరింగ్ కాలేజీ, కేశవ మెమోరియల్ ఇంజనీరింగ్ కాలేజీలో పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. బిటెక్, ఎంటెక్, బి ఫార్మసి, ఎమ్ ఫార్మసి, జెఎన్‌టియు పరిధిలో గల కాలేజీ విద్యార్థులు యూనివర్సిటీ ఇచ్చిన ఒన్ టైమ్ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని వెంకటేశ్వర్‌రావు కోరారు.

## 36.50 లక్షలతో త్రాగునీరు, డ్రైనేజీ లైన్‌కు శంకుస్థాపన

హైదరాబాద్, జనవరి 17 ప్రభాతవార్త: కాచిగూడలోని నింబోలిఅడ్డాలో 36.50 లక్షలతో నిర్మించనున్న త్రాగునీరు-డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు బుధవారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ కన్నా ఉమారమేష్‌యాదవ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పైప్‌లైన్ నిర్మాణంతో మంచినీరు, డ్రైనేజీ కొరత తీరుతుందని అశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, అధ్యక్షుడు భీష్మాదేవ్, ఓంప్రకాష్‌యాదవ్, సంబంధిత అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుండెపోటుతో బిఆర్ఎస్ నేత హఠాన్మరణం

చిక్కడపల్లి, జనవరి 17 ప్రభాతవార్త: చిక్కడపల్లికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నేత జంగం యాదగిరిమూదిరాజ్ (56) తీవ్ర గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య విజయలక్ష్మి, కుమారులు రోహిత్‌రాజ్, పృథ్విరాజ్, రోహన్‌రాజ్ ఉన్నారు. యాదగిరి మూదిరాజ్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, మాజీ కార్పొరేటర్ పలుస బాల్‌రాజ్‌గౌడ్, బిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహ, సిపిఐ ముషీరాబాద్ కార్యదర్శి బి.వెంకటస్వామిగౌడ్, బిఆర్ఎస్ నేతలు శివకుమార్ యాదవ్, కోటేశ్వరరావు, జయదేవ్ తదితరులు చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చి నివాళులు అర్పించారు. కాగా అంత్యక్రియలు గురువారం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ యాదగిరిమూదిరాజ్ అందరితో ఎప్పుడు కలిసి ఉండేవారని, ఎంతో ఆప్యాయతగా ఉంటూ ఇటు తెలుగుదేశం పార్టీలో, ప్రస్తుతం బిఆర్ఎస్‌లో ఉన్న సమయంలో పార్టీ కోసం ఎంతో కష్టపడే వారని, ఆయన మృతి పార్టీకి తీరనిలోటని అన్నారు.

## వైభవంగా సీతారామ కళ్యాణం



కార్యక్రమంలో పాల్గొన్న
లతామా ఫౌండేషన్ చైర్మన్ మాధవిలత భక్తులు

చార్మినార్,జనవరి 17 ప్రభాతవార్త : అయోధ్యలో శ్రీ రామ మందిర ప్రాణ ప్రతిష్టను పురస్కరించుకుని లతామా ఫౌండేషన్ చైర్మన్ మాధవిలత ఆధ్వర్యంలో ఘాన్సీబజార్ డివిజన్ పరిధిలోని మహావీర్‌దళ్ భవనంలో శ్రీ సీతారామ కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా లతామా ఫౌండేషన్ చైర్మన్ మాధవిలత మాట్లాడుతూ పాతబస్తీలోని పలు ప్రాంతాలలో ఆరు రోజుల పాటు శ్రీ సీతారాముల కళ్యాణాలను వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మెఘూరాణి అగర్వాల్,డాక్టర్.సరితా అగర్వాల్,పవన్ మిశ్ర,ఫంకజ్ అగర్వాల్,గౌరీశంకర్ సోనీ,రేణు సోనీ,ముఖేష్ అగర్వాల్,మొఘూరాణి అతో పాటు పలువురు పాల్గొన్నారు.

## పూసల రజనీగంగాధర్ రచనలు లోతైన పరిశోధనలతో ఉంటాయి



డాక్టర్ పూసల రజనీగంగాధర్ రచించిన గ్రంథాలను ఆవిష్కరించిన దృశ్యం

చిక్కడపల్లి, జనవరి 17ప్రభాతవార్త: డాక్టర్ పూసల రజనీగంగాధర్ రచనలు లోతైన పరిశోధనలతో ఉంటాయని విమలసాహితీ సమితి అధినేత, ఐఆర్ఎస్ అధికారి జెల్ది విద్యాధరరావుఅన్నారు. పూసల ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో డాక్టర్ పూసల రజనీగంగాధర్ రచించిన 'సామెత కథలు(కథల సంపుటి)', 'పద్యసౌరభం(పద్యసంపుటి)', 'గానగంధర్వ ఘంటసాల (హరికథ) మూడు పుస్తకాలను ఆవిష్కరించే సభ బుధవారంరాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాలలిత కళావేదికలో సాహితికిరణం ఎడిటర్ పొత్తూరి సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరై ఈ పుస్తకాలను ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూరినత, రిటైర్డ్ లెక్చరర్(బెంగళూరు) డి.విరజానంద్, రిటైర్డ్ ఐఐఆర్‌అధికారి బి.జయప్రకాశ్, లెక్చరర్ రుద్రరాజు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## నవలా రచయిత్రి ఇంద్రగంటికి సుశీలానారాయణరెడ్డి సాహితీ పురస్కారం



నవలా రచయిత్రి
ఇంద్రగంటి జానకీబాల

రవీంద్రభారతి, జనవరి 17 ప్రభాతవార్త : ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి గత 4 దశాబ్దాలుగా విశ్వవిఖ్యాత కవి, రచయిత, సాహితీవేత్త, ప్రతిష్టాత్మక జ్ఞానపీఠ పురస్కార స్వీకర్త పద్మశ్రీ డా. సి.నారాయణరెడ్డి సతీమణి సుశీల పేరిట ప్రతీ సంవత్సరం మహిళా రచయిత్రులకు సుశీలా నారాయణరెడ్డి సాహితీ పురస్కారం ప్రదానం చేస్తోందని రసమయి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. ఎం.కె.రాము మీడియాకు తెలిపారు. ఇందులో భాగంగా ఈ సంవత్సరానికి ప్రఖ్యాత సాహితీవేత్త, సంపాదకుడు ఇంద్రగంటి శ్రీకాంత్‌శర్మ సతీమణి ప్రముఖ నవలా రచయిత్రి ఇంద్రగంటి జానకీబాలకు ఇవ్వనున్నట్లు వివరించారు. జానకీబాల ఇప్పటికే 15కుపైగా నవలలు, కథలు, వ్యాసాలు రచించినట్లు, సంగీతంలోనూ ప్రావీణ్యం ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 22 సోమవారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో జరిగే ఈ కార్యక్రమంలో జానకీబాలను ఘనంగా సత్కరించి సుశీలా నారాయణరెడ్డి సాహితీ పురస్కారంతోపాటు లక్ష రూపాయల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేయనున్నట్లు ఎం.కె.రాము తెలిపారు.

## దీపాదాస్ మున్షీని కలిసిన చార్మినార్ కాంగ్రెస్ నాయకులు



కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జీ దీపాదాస్ మున్షీని కలిసిన కాంగ్రెస్ నాయకులు అలీ మస్కతి,చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ ముజీబుల్లా షరీఫ్

చార్మినార్, జనవరి 17 ప్రభాతవార్త : కేంద్ర మాజీ మంత్రి,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జీ దీపాదాస్ మున్షీని గాంధీ భవన్‌లో కాంగ్రెస్ నాయకులు అలీ మస్కతి, చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ ముజీబుల్లా షరీఫ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు.కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జీ దీపాదాస్ మున్షీని శాలువ కప్పి సన్మానించారు.ఈ కార్యక్రమంలో చార్మినార్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మణికొండ కమిషనర్‌కు సమ్మె నోటీసును అందజేసిన కార్మిక నేతలు



ఫిబ్రవరి 16.న దేశ వ్యాప్తంగా జరుపతలపెట్టిన సమ్మె నోటీసును మణికొండ మున్సిపల్ కమిషనర్‌కు అందజేస్తున్న కార్మిక నేతలు

నార్సింగి, జనవరి 17 ప్రభాతవార్త : మున్సిపల్ కార్మికుల జీతాలను రూ.26.వేలకు పెంచాలని, ఇన్సూరెన్స్‌ను చేయించాలని, కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చే ఫిబ్రవరి 16.న, దేశవ్యాప్త సమ్మెను జరుపతలపెట్టడం జరిగిందని, ఇందుకు ముందస్తుగా మణికొండ మున్సిపల్ కమీషనర్ ఫల్గుణ్ కుమార్‌కు కార్మిక సంఘం నాయకులు నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అలీ దేవేందర్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మున్సిపల్ కార్మికుల పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ దేశవ్యాప్త సమ్మెను చేయడం జరుగుతుందన్నారు. గత సర్కారు కార్మికుల కోసం తీసుకు వచ్చిన జీవోలను నేటి సర్కారు వెంటనే అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్టు విధానాలను రద్దు చేయాలని, తెలంగాణ సర్కారు ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన ఐదు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ సమ్మె చేస్తున్నామన్నారు. ఈ సమ్మెలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు రుద్ర కుమార్ యాదవ్, చంద్రశేఖర్, విజయ్, వరలక్ష్మి, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్యలో 22న శ్రీరాముడి ప్రాణ ప్రతిష్టను తిలకించండి

సైఫాబాద్, జనవరి 17 ప్రభాతవార్త: అయోధ్యలో ఈ నెల 22న రామ మందిరంలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ట సందర్భంగా ఆలయాలు, పుణ్య క్షేత్రాలలో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించాలని ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం బషీర్‌బాగ్‌లోని శ్రీకనకదుర్గా అమ్మవారి దేవాలయంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ 500 ఎళ్ళ హిందువుల అకాంక్ష అయోధ్యలో నేరవేరబోతున్నదని, ఈ మహాఘట్టం కోసం ప్రపంచంలోని కోట్లాది మంది హిందువులు ఎదురుచూస్తున్నారని చెప్పారు. ప్రజలు మీ ప్రాంతాల్లో స్వచ్ఛా అభియాన్ కార్యక్రమంలో పాల్గొని పుణ్యక్షేత్రాలను శుభ్రం చేయాలని పిలుపునిచ్చారు. కఠోరమైన ఉపావాస దీక్ష చేస్తున్న నరేంద్రమోదీకి యావత్ సమాజం మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని దేశంలోని ప్రజలే కాకుండా ప్రపంచంలోని హిందువులందరూ ప్రత్యక్షంగా, పరోక్షంగా లైవ్‌లో చూడవచ్చునని మంత్రి చెప్పారు.

## దేవాలయాల ప్రాంగణంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టండి

### మాధవరం కాంతారావు

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 17, ప్రభాతవార్త : అయోధ్యలో ఈనెల 22న రామ మందిర ప్రారంభోత్సవానికి ముందు భారతదేశంలోని అన్ని దేవాలయాల ప్రాంగణాల్లో పరిశుభ్రత (స్వచ్ఛ భారత్) కార్యక్రమాన్ని చేపట్టాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు కూకట్‌పల్లి స్వచ్ఛ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో పలు దేవాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టాలని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మాధవరం కాంతారావు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా జనవరి 18 కూకట్‌పల్లి అసెంబ్లీ పరిధిలోని కెపిహెచ్‌బి రోడ్ నెంబర్ 3, శివాలయం ప్రాంగణాలను పరిశుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారతీయ జనతా పార్టీ మధ్యప్రదేశ్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మురళీధర్‌రావు విచ్చేయనున్నారని, ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హిందూ బంధువులు, మోది అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కాంతారావు పిలుపునిచ్చారు.

## ప్రజలు ఇళ్లల్లో ఐదు దీపాల శ్రీ రామ జ్యోతులను వెలిగించాలి



విలేకర్ల సమావేశంలో పాల్గొన్న తీర్థ ట్రస్ట్ చార్మినార్ భాగ్ సంయోజక్ మజ్జిగ రమేష్,సహ సంయోజకులు విశాల్ ప్రసాద్,రామాంజనేయులు

చార్మినార్,జనవరి 17 ప్రభాతవార్త : ఐదు వందల సంవత్సరాల పోరాట ఫలితంగా అయోధ్యలో నేడు ఎంతో భవ్యమైన,దివ్యమైన శ్రీ రామ మందిరం నిర్మాణం జరిగిందని.ఈ నెల 22వ తేదీన జరగనున్న శ్రీ బాల రాముని నూతన విగ్రహ ప్రాణ ప్రతిష్ట ప్రత్యక్ష ప్రసారాన్ని టెలివిజన్ లేదా డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేసుకుని సామూహికంగా వీక్షించవచ్చునని శ్రీ రామ జన్మ భూమి తీర్థ ట్రస్ట్ చారి ్మనార్ భాగ్ సంయోజక్ మజ్జిగ రమేష్,సహ సంయోజకులు విశాల్ ప్రసాద్,రామాంజనేయులు తెలిపారు.పాతబస్తీ లాల్‌దర్వాజ సమీపంలోని రాంభక్షబండ శ్రీరామ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ సోమవారం ఉదయం 10 గంటలు నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజలు తమ సమీపంలో ఉన్న దేవాలయాలకు చేరుకుని పూజలు నిర్వహించటంతో పాటు అందరూ కలిసి శ్రీ రామ జయ రామ జయజయ రామ అనే విజయ మహా మంత్రాన్ని 108 సార్లు జపించాలని, సాయంత్రం ఏడు గంటలకు ప్రజలు తమ ఇళ్లలో కనీసం ఐదు దీపాలు శ్రీ రామ జ్యోతులను వెలిగించాలని తెలియజేశారు.

### బోర్డు సిఈఓకు శుభాకాంక్షలు తెలిపిన చొల్లేటి

కంటోన్మెంట్, జనవరి 17 ప్రభాతవార్త: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని వెస్ట్ మారేడ్‌పల్లిలోని శ్రీ సుబ్రమణ్య స్వామి ఆలయ పాలక మండలి సభ్యుడు శ్రీగణేష్ బుధవారం కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

# తూకాల్లో మోసాలు

చేయకపోయినా చాలావరకు మోసాలు చేస్తున్నారు. కొందరు చేసే పనివల్ల మార్కెట్లో అందర్ని అనుమానించే పరిస్థితి నెలకొంది. మార్కెట్‌లతో పాటు కూరగాయలు, బియ్యం దుకాణాల్లో కూడా మోసాలు జరుగుతున్నాయి. 25 కేజీల బియ్యం బ్యాగు కొనుగోలు జరిపితే 24.5 కేజీలు మాత్రమే ఉంటున్నాయి. ఉల్లిగడ్డలు వందకు 3, 4 కేజీలు అంటు బోర్డులు పెట్టుకొని విక్రయిస్తుండగా కొన్నవారికి దాదాపు 15 శాతం నుండి 20 శాతం తక్కువగా వస్తున్నాయి. కూరగాయల మార్కెట్‌లో కూడా చేతివాటం చూపిస్తున్నారు. చుక్కలనంటే ధరలతో ఇబ్బందులు పడుతుండగా తూకాల్లో కూడా నష్టం జరుగుతుండడం పట్ల ఆందోళన చెందుతున్నారు. మార్కెట్‌లలో ఎలక్ట్రానిక్ మెషిన్‌లు వినియోగిస్తున్నప్పటికి మోసాలు జరుగుతూనే ఉన్నాయి. తూకం వేసినప్పుడు సక్రమంగా చూపినప్పటికి వేరేచోట తూకం వేసిచూస్తే కేజీకి 150 గ్రాములు తక్కువగా ఉంటున్నాయి. కొన్నిసార్లు ఎలక్ట్రానిక్ తూకాల్లో కేజీల మోడ్‌లో ఉండవలసిన మెషిన్‌లు లీటర్ల మోడ్‌లో ఉండడం వల్ల మోసాలు జరుగుతున్నాయి. కేజీకి 1000 గ్రాములు ఉండాల్సి ఉంటుంది. కానీ లీటర్ల మోడ్‌లో ఉండడం వల్ల 920 గ్రాములు మాత్రమే వస్తున్నాయి. దీంతో కొనుగోలుదారులు 80 గ్రాములు నష్టపోతున్నారు. ఇక పూల వ్యాపారులకైతే అడ్డుఅదుపూ లేకుండా పోతోందని వినియోగారులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా పండగల సమయంలో బంతి, చామంతి లాంటి పూవ్వులు అధికంగా వినియోగిస్తారు. కేజీ పూలు తీసుకుంటే కేవలం 600 నుండి 650 గ్రాములు మాత్రమే తూగుతుంటాయి. దీనికి రెండు రకాల కారణాలు ఉంటాయి. తూకంలో మోసం చేయడంతో పాటు పూలపై ఎక్కువగా నీళ్లు చల్లి విక్రయిస్తుంటారు. దీంతో పెట్టిన ఖర్చుకు సరిపడా పూలు రాకపోవడంతో నష్టపోతున్నారు. ఇంత జరుగుతున్నా వీరిపై చర్యలు తీసుకోడానికి తూనికలు కొలతల అధికారులకు సమయం దొరకడం లేదు. అప్పుడప్పుడు చిన్నచిన్న వ్యాపారులపై కేసులు నమోదు చేస్తుంటారు.

**కొనుగోలుదారులు జాగ్రత్తలు తీసుకోవాలి..** నిత్యవసర వస్తువులే కాకుడా తూకం, కొలతల్లో తీసుకోవాల్సి న వాటిని సరైన తూకంలో తీసుకోవాలని, ఎవరైనా తక్కువగా తూకంవేసి ఇస్తే అభ్యంతరం చెప్పాలని అధికారులు చెబుతుంటారు. కాని కొనుగోలు సమయంలో ఎవరైనా తూకం గురించి ప్రశ్నిస్తే వ్యాపారుల నుంచి దాడి చేసినంత పని ఎదురవుతోంది. అవమానకరంగా మాట్లాడడమే కాకుండా కొందరు బూతులు తిడుతూ తరిమేసినంత పనిచేస్తారు. ఇలాంటి తరుణంలో కొనుగోలుదారులు అందరూ ఏకమై ప్రశ్నించే అవకాశం ఉన్నా కొనుగోలుదారులు మనకేందుకులే అనుకుంటు వ్యవహరిస్తుంటారు. చర్యలు తీసుకొనే అధికారం ఉన్నా వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో కొనుగోలుదారుల పరిస్థితి అయోమయంగా మారుతోంది.

## ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న గుజరాతీ ప్రగతి సమాజ్ ప్రతినిధులు



గన్‌ఫౌండ్రి,జనవరి17ప్రభాతవార్త:గుజరాతీ ప్రగతి సమాజ్ ఆద్వర్యంలో ప్రగతి మహా విద్యాలయ డిగ్రీ కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను గురువారం ప్రారంభమై 20వ తేది వరకు కొనసాగుతాయని ఉత్సవాల ఛీఫ్ ప్యాట్రన్ మహేష్ ఎస్.పటేల్,గుజరాతీ సమాజ్ అద్యక్షులు,ఉత్సవాల చైర్మన్ గోవింద్‌దాస్‌షా తెలిపారు.బుధవారం కళాశాలలో సమావేశహాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలోప్రతినిధులు గోపాల్‌ఓపటేల్,రాహుల్‌చేడా, అంబాలాల్‌పటేల్, జీతన్‌మజీతేలా, భారతీబైపటేల్‌కలిసి మాట్లాడుతూ 1973 సంవత్సరంలో ఏర్పాటు చేసిన కళాశాల అంచెలంచెలుగా ఎదుగుతూ విద్యారంగంలో 50 సంవత్సరాలు పూర్తి చేసుకుని ఎంతో అభివృద్ది సాధించినట్లు చెప్పారు.విద్యారంగంలో కాకుండా సామాజిక సేవా రంగాలల్లో గుజరాతీ ప్రగతి సమాజ్‌తోపాటు ఎంతో అభివృద్ధి సాధించినట్లు చెప్పారు.ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డితోపాటు భారత దేశ భద్రతలో విధులను నిర్వహిస్తున్న ఎంతో మంది తమ కళాశాలల్లో విద్యాభోదనలు చేసినట్లు వివరించారు. పారిశ్రామికరంగాలల్లో కూడా ఉన్నటు వెల్లడించారు.18వ తేదిన సుల్తాన్‌బజార్ ఎసిపి ఎ.సి బాలగంగిరెడ్డి,ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ ప్రొఫెసర్ వి.అప్పారావులు ఉత్సవాలను ప్రారంభిస్తారన్నారు. ముగింపు ఉత్సవాలకు కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల,తెలంగాణ పంచాయితీరాజ్‌శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానీయా,తెలంగాణ విద్యాశాఖ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ఆర్.లింబ్రాదిలు విచ్చేయనున్నట్లు వివరించారు.ఈసమావేశంలో కన్వీనర్లు ప్రొఫెసర్ వై.కె.ఎం.నాయుడు,డాక్టర్ ఎ.మాధవిలత,టి.ఇ రాజగోపాలన్,కో-కన్వీనర్ ఎస్.అమిత్‌సింగ్,ఎన్.సి.సి అధికారిటి.పి.సింగ్,హైందవి విద్యాసంస్థల చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

**మర్పల్లి, జనవరి 17, ప్రభాతవార్త** మర్పల్లి మండల కేంద్రానికి చెందిన తలారి వెంకటేశంముదిరాజ్ మంగళవారం రాత్రి అకస్మాత్తుగా ఛాతినొప్పితో మృతి చేందాడు. అట్టి విషయాన్ని తెలుకున్న ఎస్,కే, ఆర్ ట్రస్ట్ చైర్మెన్, జిల్లా గ్రాంథాలయ మాజీ చైర్మెన్ సనగారికొండల్‌రెడ్డి బుధవారం నాడు మృతుడి అంత్యక్రియలకు 5000 వేల రూపాయలు పిఏసిఎస్ వైస్ చైర్మెన్ ఫాసి యుద్దీన్ దారా పంపగా, అలాగే మార్కేట్ కమిటి వైస్ చైర్మెన్ మదుగు రామేశ్వర్ 5000 వేల రూపాయలు మృతుడి ఇంటికి వెళ్ళికుటుంబ సభ్యు లను పరామర్శించి నగాదును అందజేశారు. దివాకర్, రాములు, కాజ, శ్రీనివా స్‌రెడ్డి, పలువురు గ్రామస్తులు పాల్గోనగా, మర్పల్లి జడ్పిటీసి, మధుకర్ కాజ, శ్రీను, రాములు, మృతుడి కుటుంబాన్ని పమర్శించి 5000 వేల రూపాయలనగాదును అందజేశారు. పలువురు గ్రామస్తులు పాల్గోన్నారు.

## ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు



క్యాలండర్ ఆవిష్కరణ చేస్తున్న నాయకులు, అధికారులు

**జిల్లెడు చౌదరిగూడ, జనవరి 17,(ప్రభాతవార్త):** గ్రామాల్లోని ప్రతి ఇంటికి కేంద్ర ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని జిల్లెడు చౌదరి గూడ మండల బిజేపి మండల అధ్యక్షుడు బోయ కుర్మయ్య అన్నారు. బుదవారం మండలంలోని గాలిగూడ, గుర్రంపల్లి, గుంజ ల్ప హాడ్ గ్రామాల్లో వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో కుర్మయ్య మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్రమోది ప్రధాని అయిన తరువాత నిరుపేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. అనంతర 2024నూతన క్యాలండర్ ఆవిష్క రణ చేశారు. డాక్టర్ కుస్థాథిం, డాక్టర్ తబసుం, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి, సర్పంచ్ గోపాల్, కిష్టమ్మ, హన్మంత్‌రెడ్డి, మల్లెష్, యాదయ్య, మోహన్, రాజేశ్వరి, అమృత, ఉదియ, నర్సింహులు, వెంకటేష్, రాజ్‌కుమార్, నరేష్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో క్రమశిక్షణ పెరుగుతుంది

**మండల విద్యాశాఖాధికారి సయ్యద్ అక్బర్**

**శంకర్‌పల్లి, జనవరి 17 ప్రభాతవార్త:** క్రీడలతో క్రమశిక్షణ, జాతీయ సమైక్యత పెంపొందించడంలో ఎంతగానో దోహదపడతాయని శంకర్‌పల్లి మండల విద్యాశాఖాధికారి సయ్యద్ అక్బర్ అన్నారు. అంకుర హోమ్స్ లిటిల్ చాంపియన్స్ వాలీబాల్ టోర్నమెంటు సందర్భంగా ప్రతి పాఠశాలకు గత రెండు సంవత్సరాలుగా వాలీబాల్ క్రీడాసామగ్రిని అందజేయడం, వాలీబాల్ టోర్నమెంట్స్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు చక్కటి క్రమశిక్షణ, మంచి స్నేహం, పోటీతత్వంతో పాటు పట్టుదలను కూడా పెంపొందించుకుంటారని అన్నారు. వార్డు సభ్యులు మంగళరం విట్టల్, మహమ్మద్ షాబుద్దీన్‌లు మాట్లాడుతూ వాలీబాల్ టోర్నమెంటును జనవరి 20 శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మోకిలలోని తెలంగాణ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. శంకర్‌పల్లి మండలంలోని 13 ప్రభుత్వ పాఠశాలల నుంచి బాల బాలికలు పాల్గొంటారని అన్నారు. విజేతలైన వారికి రూ.20 వేల నగదుతో పాటు ట్రోఫీ మెడల్స్, క్రీడాదుస్తులు పంపిణీ చేస్తారని తెలిపారు. గ్రామ సర్పంచ్ పట్లోళ్ల సుమిత్ర మోహన్ రెడ్డి, జిల్లా విద్యాధికారి సుశీందరరావు, ఎంపిడిఓ వెంకయ్యగౌడ్, మోకిల్ సిఐ, ఎంపిటిసి సరిత రాజు నాయక్, వార్డు సభ్యుల చేతుల మీదుగా అందజేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. క్రీడల్లో పాల్గొనే వారికి అల్పాహారంతో పాటు చక్కటి భోజనం, రవాణా సౌకర్యం, వసతి కల్పించబడుతుందని తెలిపారు.

## వీడని మృతదేహం మిస్టర్

**ఆదిభట్ల జనవరి17,ప్రభాతవార్త :** ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం లభ్యమైన మృతదేహం కేసు మిస్టరీ ఇంకా వీడలేదు. హత్య చేసి గుర్తు తెలియని దుండగులు మృతదేహన్ని గోన సంచిలో పెట్టి పడేశారు. చేతికి కడియం మెడలో బంగారు గొలుసు కాలికి నలడా లభ్యమయ్యాయి. మృతుని వివరాల కోసం పోలీసులు తీవ్రంగా దర్యాప్తు చేస్తున్నారు. మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి ఆధ్వ ర్యం లో 9 ప్రత్యేక బృందాలతో మిస్టరీని చేధించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ మర్డర్ ఐదు రోజుల క్రితం జరిగినట్టుగా పోలీసులు అనుమానాలు వ్యక్త పరుస్తున్నారు.

## ప్రజలకు సేవచేసేందుకు అందుబాటులో ఉంటా



పూడూరు మండలం కడ్మూరులో కుర్చీలను ఏర్పాటు చేస్తున్న యువనాయకులు మొగ్రి చిన్న బందయ్య తదితరులు

**పూడూరు, జనవరి 17, ప్రభాతవార్త :** గ్రామ ప్రజలకు సేవచేసేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని యువజన సంఘం నాయకుడు మొగ్రి చిన్నబందయ్య పేర్కొన్నారు. బుధవారం పూడూరు మండలం పరిధిలోని కడ్మూరు, మిట్టకంకల్ గ్రామాల ప్రజల సౌకర్యార్థం తన సొంత నిధులతో 50 సిమెంట్ కుర్చీలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిట్టకంకల్ గ్రామంలో యువత కోరికమేరకు సొంత నిధులతో క్రికెట్‌కిట్టును అందజేశానని వివరించారు. కడ్మూరు, మిట్టకంకల్ గ్రామాల్లోని బస్‌స్టాండ్‌ల వద్ద కుర్చీలు లేక ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారని వారి సౌకర్యార్థం ఆయా ప్రాంతాలతోపాటు, హనుమాన్ మందిరాలు, ప్రధాన కూడళ్లలో ప్రజలు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో సిమెంట్‌కుర్చీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నాయకులు వెం కటస్వామిగౌడ్, పి యాదయ్య, బి. శంకర్, బాలకిష్టయ్య, పి మల్లయ్య ,రాజు, సుక్కయ్య, పైలయ్య, సైదయ్య, కెసుక్కయ్య, కిష్టయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు,



జహంగీర్ పీర్ బాబాలకు దట్టీలు సమర్పిస్తున్న శ్యాంసుందర్‌రెడ్డి

## జాహంగీర్ పీర్ దర్గాలో గుసూల్ ఏ షరీఫ్

**ప్రత్యేక ప్రార్థనలు చేసిన ట్రబుల్ షూటర్‌మాజీ జెడ్పీటిసి శ్యాంసుందర్‌రెడ్డి**

**కొత్తూర్, జనవరి 17, ప్రభాతవార్త:** కులమతాలకు అతీతంగా ప్రసిద్ధి చెందిన జెపి దర్గాలో గుసూల్ ఏ షరీఫ్ కార్యక్రమం నిర్వహించారు. కొత్తూరు మండలంలోని ఇనుముల నర్వ జహంగీర్ పీర్ దర్గాలో ఈ నెల 18న ఉర్సు ఉత్సా వాల సందర్భంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గుసూల్ ఏ షరీఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యమ్రానికి ముఖ్య అతిధిగా ట్రబుల్ షూటర్ మాజీ జెడ్పిటీసి మామిడి శ్యాంసుం దర్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దర్గా ఉర్సు నేపథ్యంలో ప్రతి సం వత్సరం గుసూల్ ఏ షరీఫ్ నిర్వహించడం అనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా సమాధులను పాలతో శుభ్రపరిచి అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. జెపి దర్గా ఉర్సు ఉత్సవాలను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. అలాగే శాంతి భద్రతల విషయంలో ఎలాంటి రాజీలేకుండా చూడాలని పోలీ సులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రవికుమార్ గుప్తా, శంకర్ నాయక్, కొర్ర రవి, బాబు ముదిరాజ్, ప్రేమ్‌నాయక్, బిచ్యా, బాసు నాయక్, మాస్టర్ ఆంజనేయులు, బాలరాజ్, కోమటిశేఖర్, దశరథ్, నాను, ఖాజ, శోకత్, సదక్ శ్రీకాంత్, హబీబ్, రషీద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌పార్టీలో మాదిగలకు రెండు ఎమ్మెల్సీ స్థానాలను కేటాయించాలి

**మండల యంఆర్‌పిఎస్ అధ్యక్షుడు యం.శ్రీనివాస్**



సమావేశంలో మాట్లాడుతున్న యంఆర్‌పిఎస్ నాయకులు

**పెద్దేముల్, జనవరి 17, ప్రభాతవార్త:** తెలంగాణ వ్యాప్తంగా అత్యధిక జనాబా కలిగిన మాదిగలకు కాంగ్రెస్‌పార్టీలో రెండు ఎమ్మెల్సీ స్థానాలను కేటాయించాలని మండల యంఆర్‌పిఎస్ అధ్యక్షుడు యం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుదవారం పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో నిర్వహించిన యంఆర్‌పిఎస్ మండల స్థాయి సమావేశానికి జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, ప్రధానకార్యదర్శి స్వామిదాసు హజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అతి త్వరలో జరగబోతోందని, మాదిగల చిరకాల స్వప్నం ఫలించనుందని అన్నారు. అందుకు మాదిగలు సంఘటితం కావాలసిన అవసరం ఎంతైన ఉందని అన్నారు. మందక్రిష్ణ మాదిగ నాయకత్వంలో జరిగిన పోరాటం వల్లె సమాజానికి అనేక అవకాశాలు దక్కాయిని గుర్తు చేశారు. మండలంలో యంఆర్‌పిఎస్ బలంగా ముందుకు సాగాలని అందుకు కలిసి కట్టుగా సాగాలని నాయకులు తీర్మాణం చేశారు. తెలంగాణలో మాదిగలకు మంత్రి వర్గంతో పాటు ఎంఎల్‌సి స్థానాలలో కూడా సముచితం కల్పించాలని కాంగ్రెస్‌పార్టీని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యంఆర్‌పిఎస్ మండల అధికార ప్రతినిధి మోహన్ మాదిగ, ప్రదాన కార్యదర్శి దావిద్ మాదిగ, కార్యదర్శి హరిసూధన్, ప్రచార కార్యదర్శి సాయికుమార్, ఉపాధ్యాక్షుడు భరత్, సలహదారుదు ఎల్లెశం, కార్యవర్గ సభ్యులు బాల్‌రాజ్, అనిల్, కవిరాజ్, జిల్లా సీనియర్ నాయకులుగుడిసు గోపాల్, పి.ప్రకాశం, సుందర్, బోనప్ప, రత్నం, జయప్ప, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాప్రతినిధులను అగౌరవ పరుస్తున్న ఐకేపి ఎపిఎం

**సమావేశాలకు ఆహ్వానించడంలేదని ఎపిఎంపై వైస్ యంపిపి ఆగ్రహం**



ఏపిఎంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైస్ యంపిపి

**పెద్దేముల్, జనవరి 17, ప్రభాతవార్త:** ప్రజాప్రతినిధుల పట్ల ఐకేపి ఎపిఎం చిన్నచూపు చూస్తు తమను అగౌరవ పరుస్తున్నారని వైస్ యంపిపి మధులత శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బుదవారం పెద్దేముల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి వైస్‌యంపిపి మధులత శ్రీనివాస్ హజరయ్యారు. ఈ సందర్బంగా మధులత మాట్లాడుతూ మండల స్థాయిలో నిర్వహించిన డ్వాక్ర సంఘాల సర్వసభ్య సమావేశానికి, గ్రామాలలో నిర్వహిస్తున్న సమావేశాలకు తమను ఆహ్వానించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషిచేస్తున్న తమను ఐకేపి ఎపిఎం బాలయ్య చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎపిఎం బాలయ్య ఇష్టానుసారంగా సమావేశాలు నిర్వహిస్తు ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడంలేదని ఎమ్మెల్యే ముందు ఏకరువు పెట్టారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా సమావేశాలు ఎలా నిర్వహిస్తారని మండి పడ్డారు. మరోసారి ఇటువంటి సంఘటన పునరావృత్తం కాకుండా చూసుకోవాలని, లేనిచో సహించేదిలేదని ఎపిఎంను మందలించారు.

## క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగు

**చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి**

**చేవెళ్ల, జనవరి 17 ప్రభాతవార్త :** క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగుపదుతాయని చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి అన్నారు. మండల పరిధిలోని తంగడిపల్లి అనుబంధ గ్రామమైన మడికట్టు గ్రామంలో ఎన్కతల మహేందర్ గౌడ్, ఎన్కతల మల్లయ్యగౌడ్ జ్ఞాపకార్థం వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను సీఐ లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడాకారులు గెలుపోటములు సమానంగా తీసుకోవాలని, క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగు పడుతాయన్నారు. యువతను మంచి మార్గంలో నడిపించే శక్తి క్రీడలకు మాత్రమే ఉందని, క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రామస్వామి, గుణశేఖర్, ఆర్. సుధాకర్‌రెడ్డి, కె. మల్లేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లేష్, ఉపాధ్యాక్షుడు నాగేష్, గోవర్ధన్, జైపాల్‌రెడ్డి, అశోక్, యాదగిరి, యాదయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



సీఐ లక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

# కలెక్టరేట్ ప్రాంగణంలో సిబిఆర్ఎం డ్రిల్ ఎక్సరసైజ్

**మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సమక్షంలో టెన్త్ బెటాలియన్ ఎన్‌డిఆర్ఎఫ్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వాహణ**

**ప్రమాదాల నుంచి తమను తాము కాపాడుకోవటానికి అవగాహన**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 17, ప్రభాతవార్త**

మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో సిబిఆర్ఎం డ్రిల్ ఎక్సరసైజ్ కార్యక్రమాన్ని నిర్వహించి అధికారులకు, సిబ్బందికి, ప్రజలకు టెన్త్ బెటాలియన్ ఎన్‌డిఆర్ఎఫ్ వారు అవగాహన కల్పించారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో సిబిఆర్ఎం డ్రిల్ ఎక్సరసైజ్ కార్యక్రమం నిర్వహించారు. మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సమక్షంలో టెన్త్ బెటాలియన్ ఎన్‌డిఆర్ఎఫ్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ అడిషనల్ ఎస్‌పి దామోదర్‌సింగ్, ఇన్స్‌పెక్టర్ గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వాహణ జరిగింది. ఆపద సమయంలో ప్రాణాలను ఎలా కాపాడాలనే విషయంపై ఎన్‌డిఆర్ఎఫ్ వారు ప్రాక్టికల్‌గ చేసి చూపించారు. అయితే బ్లాస్ట్ సమయాల్లో, కెమికల్ లీకేజీ జరిగినపుడు ఏ విధంగ తమను తాము కాపాడుకోవాలనే అంశంపై మోడ్ డ్రిల్ నిర్వహించి అధికారులకు, కలెక్టరేట్ సిబ్బందికి అవగాహన కల్పించారు. బ్లాస్ట్, కెమికల్ లీకేజీ, ఇతర పెను ప్రమాదాలు సంబంవించినపుడు తమను తాము కాపాడుకోవటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎన్‌డిఆర్ఎఫ్ బెటాలియన్ వారు నిర్వహించటం అభినందనీయమని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్‌డిఆర్ఎఫ్ బృందం, మెడికల్ సిబ్బంది కూడ వెంటనే అప్రమత్తం కావటం మాదల్ సంఘటనలను ప్రదర్శన ద్వారా చూపించటం అందరిని ఆకట్టుకుంది. మోక్ డ్రిల్ ఎక్సరసైజ్ నిర్వహించి చూపించటం అందరిని అలర్ట్ చేసిందన్నారు. ఎన్‌డిఆర్ఎఫ్ వారు చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియ, అడిషనల్ ఎస్‌పి దామోదర్‌సింగ్, ఇన్స్‌పెక్టర్ గౌతమ్‌కుమార్, సిబ్బంది, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జరిగిన సిబిఆర్ఎం డ్రిల్ ఎక్సరసైజ్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, పాల్గొన్న డిఆర్ఓ హరిప్రియ, అడిషనల్ ఎస్‌పి దామోదర్‌సింగ్, సిబ్బంది, తదితరులు



కలెక్టరేట్ ప్రాంగణంలో మాక్ డ్రిల్ ఎక్సరసైజ్ కార్యక్రమం జరిగిన దృశ్యం



ఆపద సమయంలో ప్రాణాలను కాపాడటానికి అవగాహన కల్పించిన ఎన్‌డిఆర్ఎఫ్ వారి దృశ్యం

## ఓఆర్ఆర్‌కు సేకరించిన భూమి అంతా ధరణిలో నమోదు విషయంపై సమీక్ష

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 17, ప్రభాతవార్త**

ఓఆర్ఆర్ కోసం సేకరించిన భూమి అంత కూడ ధరణిలో నమోదు జరిగిందా లేదా పరిశీలించాలని హెచ్ఎండిఏ అధికారులతో మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సమీక్షించారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో హెచ్ఎండిఏ అధికారులతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఓఆర్ఆర్ భూమి సేకరణకు సంబంధించి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆరా తీసి సమీక్షించారు. దీంతో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పేర్కొంటూ ఓఆర్ఆర్ నిర్మాణానికి మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు సంబంధించిన కీసర, ఘట్‌కేసర్, మేడ్చల్, శామీర్‌పేట, దుండిగల్, గండిమైసమ్మ మండలాల్లో భూసేకరణ జరిగిన విషయంపై తహసీల్దార్లు, హెచ్ఎండిఏ అధికారులతో సమావేశం నిర్వహించి ఓఆర్ఆర్‌కు సేకరించిన భూమి అంత ధరణిలో నమోదు జరిగిందా లేదా పరిశీలించి హెచ్ఎం డిఏ సేకరించిన భూమి ఆ వార్డు వారీగ పరిశీలించి ఏమైనా భూమి ఇంకా ధరణిలో నమోదు కానట్లైతే అలాగే కోర్టులో అవార్డు కంపెన్షన్ అమౌంట్ డిపాజిట్ చేసినట్లు అయితే అట్టి వివరాలు సమర్పించాలని, అలాగే ధరణిలో నమోదు చేయటానికి తగు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. దీనిలో ఆర్డీఓలు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, పాల్గొన్న ఆర్డీఓలు, అధికారుల దృశ్యం



దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమెల్యే, మాజీ ఎమ్మెల్యే తదితరులు.

## వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

**కొందుర్గు, జనవరి 17, (ప్రభాతవార్త) :** మండల పరిధిలోని వెంకిర్యాల శివారులో గల శ్రీ సంజీవపురం వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని బుధవారం మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యులు మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిలు సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ కమిటీచైర్మన్ రామకృష్ణ, సర్పంచి లింగమయ్యగౌడ్‌లతో పాపటు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడే కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించారు. ఆ తర్వాత ఎడ్ల బండ్ల ఉత్సవాలు, బోనాల సంబరాలల్లో వారు పాల్గొనానరు. జాతర కోసం ఏర్పాట్లను మంచిగా చేశారని కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మాసయ్యగౌడ్, రామకృష్ణ, మల్లేష్‌గౌడ్, బాల్‌రెడ్డి, పోతురాజు గోపాల్, రాజాజ నర్సింహ్మారెడ్డి, లింగంగౌడ్, రావిర్యాల రాజు, ఎన్. చంద్రశేఖర్, రాములుగౌడ్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, పసుల నర్సింలు, నర్సింహ్మారెడినడ, కుమ్మరి బాల్‌రాజ్‌తో పాటు భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీపెద్దమ్మ తల్లి ఆలయం వద్ద అన్నదానం



ఉప్పరిపల్లిలోని శ్రీపెద్దమ్మ తల్లి ఆలయం వద్ద జరిగిన అన్నదాన కార్యక్రమం దృశ్యం

**శామీర్‌పేట, జనవరి 17, ప్రభాతవార్త**

ఉప్పరిపల్లిలోని శ్రీపెద్దమ్మ తల్లి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం జరిగింది. బుధవారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని ఉప్పరిపల్లిలోని శ్రీపెద్దమ్మ అమ్మవారి ఆలయం వద్ద 184వ బుధవారంను పురస్కరించుకుని దాతల చేయూతతో అన్నదాన కార్యక్రమం జరిగింది. శ్రీపెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేకంగ పూజలు నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో విచ్చేసి దర్శించుకుని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమానికి బొమ్మరాసిపేట్‌కు చెందిన బిక్షపతిరెడ్డి, లక్ష్మి, శ్రీకాంత్‌రెడ్డి, శ్వేతలు, 5వేల రూపాయలు, తిమ్మాయిపల్లికి చెందిన భూపాల్‌రెడ్డి, విమలలు 1,021రూపాయలు, కాళ్లకల్‌కు చెందిన మహంకాళి, అండాలు 50కిలోల బియ్యం, ఉప్పరిపల్లి గ్రామానికి చెందిన చికోటి నరసింహ్మా, యశోధ, గున్నాల మల్లేశ్, నాగమణిలు 25కిలోల చొప్పున (ఆ ఇద్దరు)ఇరువురు బియ్యంను అన్నదానం కోసం అందజేసినట్లు ఆలయ నిర్వాహకులు, సభ్యులు పేర్కొన్నారు. ప్రతి బుధవారం ఉప్పరిపల్లి శ్రీపెద్దమ్మ తల్లి ఆలయం వద్ద అన్నదానం జరుగుతున్నందున భక్తులు భారీ సంఖ్యలోనే పాల్గొనటం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఆ దాతలతో పాటు గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, నాయకులు, ఆలయ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## స్కూల్‌పైన సెల్‌టవర్ నిర్మాణం పనులు

**నిలిపివేయాలని అధికారులకు ఫిర్యాదు**

**ఘట్‌కేసర్, జనవరి 17, ప్రభాతవార్త**

ఘట్‌కేసర్ మున్సిపాల్టీ పరిధిలోని ఎన్ఎఫ్‌సి నగర్‌లో మాంస్ ఎంజిల్స్ స్కూల్ పైన ఏర్పాటు చేస్తున్న సెల్‌టవర్ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని ఆ కాలనీవాసులు ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్‌కు, ఎంఇఓకు ఫిర్యాదు చేశారు. ఆ స్కూల్‌కు ఎదురుగా ఉన్న కేంద్రీయ విద్యాలయంలో సుమారు వెయ్యి మంది వరకు విద్యార్థులు ఉండటం సంచరించటం జరుగుతుందని, ఆ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం వారు స్కూల్ పైననే సెల్‌ట వర్ ఏర్పాటుకు పనిచేయించటం జరుగుతుందని అన్నారు. సెల్‌టవర్ రెడియేషన్ ప్రభావంతో స్థానిక ప్రజలు, విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతినే పరిస్థితి ఉంటుందని ప్రమాదం ఉందని మల్లేశ్‌యా దవ్‌తో పాటు ఆ కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. వెంటనే విచారణ జరిపి సెల్‌టవర్ నిర్మాణ పనులను నిలిపివేయాలని తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## జాతీయ తెలుగు దినపత్రిక వార్త క్యాలంర్ ఆవిష్కరణ



జాతీయ తెలుగు దినపత్రిక వార్త 2024 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించిన శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి ప్రవీణ్‌కుమార్

**శంకర్‌పల్లి, జనవరి 17 ప్రభాతవార్త:** జాతీయ తెలుగు దినపత్రిక వార్త 2024 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి ప్రవీణ్‌కుమార్ బుధవారం ఆవిష్కరించారు. సమాజంలో జరుగుతున్న అనేక అంశాలను ప్రజల దృష్టికి తీసుకు వచ్చి, ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా వార్త దినపత్రిక నిలుస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, కౌన్సిలర్లు చంద్రమౌళి, బాలకృష్ణ పాల్గొన్నారు.

## మండలంలో వికాసిత్ భారత్ సంకల్ప యాత్ర

**తొగుట, జనవరి 17, ప్రభాతవార్త :**

తొగుట మండల పరిధిలోని జప్తిలింగారెడ్డిపల్లి, వెంకట్రావుపేట గ్రామంలో బుధవారం వికాసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు, బ్యాంకు ఖాతా తీసుకోవడం వలన ఉపయోగాలు, ఖాతాను ఎలా వినియోగించాలి.. కుటుంబ బడ్జెట్, వ్యక్తి, బడ్జెట్, బ్యాంకు ఖాతా రకాలు, ఇ-కేవైసీ, నామినీ ప్రాముఖ్యత బీమా రకాలు, ప్రధాన మంత్రి సురక్ష, బీమా యోజన, జీవన్‌జ్యోతి, బీమా యోజన అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన, ఉజ్వల, అయుష్మాన్ కార్యక్రమంలో జిల్లా వికాసిత్ భారత్ జిల్లా కో-ఆర్డినేటర్ విభీషణ్‌రెడ్డి, సర్పంచ్‌లు బొడ్డు నరసింహులు యాదవ్, చిలువేరు జ్యోతిమల్లారెడ్డి, పాత్కుల లీలాదేవి, ఎంపిటిసి కంకణాల నర్సింలు, ఏపి గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ భరత్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ రాధాకృష్ణ, అయూష్ డాక్టర్ సుభాషిని, హెల్త్ సూపర్ వైజర్ శ్యామల, ఏఎన్ఎంలు రాములు, లక్ష్మీ, వివిధశాఖల అధికారులు, కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఆయోధ్య నుంచి ఆహ్వానపత్రం అందిస్తున్న ఆశ్రమ పీఠాధిపతి

## అయోధ్య నుంచి సిద్దేశ్వరస్వామికి ఆహ్వానం

**ఝరాసంగం, జనవరి 17, ప్రభాతవార్త:** ఈ నెల 22న ఉత్తరప్రదేశ్ లోని అయోధ్యలో శ్రీరామ మందిరంలో బలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు హాజరు కావాలని బర్దీపూర్ గ్రామంలోని శ్రీదత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి సిద్దేశ్వరానందగిరి మహారాజ్‌కు ఆహ్వానం అందినట్లు ఆశ్రమ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం పేర్కొన్నారు. బుధవారం ఆశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామస్థులతో కలిసి అల్లాడి వీరేశం మాట్లాడుతూ దత్తగిరి ఆశ్రమం నుంచి అయోధ్యలో కొనసాగే శ్రీరాములోరి ప్రాణ ప్రతిష్టలో పాల్గొనే అవకాశం కలగడం ఈ ప్రాంత అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధిపతి వైరాగ్య శిఖామణి అవూదూతగిరి మహారాజ్(అప్పగారు), గ్రామస్థులు కోట శ్రీనివాస్, రమేష్ పాటిల్, నాగన్న, గొల్ల నరసింహులు, బోయిని ఎల్లన్న, కోట వెంకటన్న, వడ్ల సంగమేశ్వర్, ఓంకార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంపల్లిలో ఫార్మేషన్ రోడ్డుకు శ్రీకారం



ఫార్మేషన్ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

**మునిపల్లి, జనవరి 17,ప్రభాతవార్త:** మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ఫార్మేషన్ రోడ్డు నిర్మాణానికి బుధవారం జడ్పీటిసి సభ్యురాలు మీనాక్షిసాయికుమార్, సర్పంచ్ మహ్మద్ జాస్మిన్ గుడ్డు పటేల్ భూమిపూజ నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట పొలాలకు వెళ్లడానికి దారులు లేక రైతులు ఇబ్బందులుపడుతున్నారని, దీనిని పరిష్కరించేందుకు ఫార్మేషన్ రోడ్డుకు శ్రీకారం చుట్టామన్నారు. ఉపాధి హామి కూలీలు పనులను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తుడుం శాంతమ్మసుభాష్, క్షేత్ర సహాయకులు తుడుం రాజేందర్, వార్డుసభ్యులు బుర్ర నరేష్, నాయకులు గుజ్జరీ పాండు, టేకురి నాగరాజు, ఎల్లగారి వీరన్న, నక్కనగారి నర్సింలు, ఎస్ఎంసి చైర్మన్ బేగరి నర్సింలు, బేగరి సంగమేశ్వర్, బేగరి సిద్దు, తుడుం రాజు, బైగారి నర్సింలు, తుడుం నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు నమోదుపై ట్రాన్స్‌జెండర్‌లకు అవగాహన



ఓటరు నమోదుపై ట్రాన్స్ జెండర్‌లకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

**కంది, జనవరి 17, ప్రభాతవార్త:** ఓటరు నమోదుపై బుధవారం తహసీల్దార్ ట్రాన్స్ జెండర్‌లకు అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన వారు తమ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు. బుధవారం మండల కేంద్రమైన కందిలోని లక్ష్మీనగర్ కాలనలో ట్రాన్స్ జెండర్‌లతో ప్రత్యేకంగా కలుసుకుని సమాజంలో ఓటు హక్కుకు ఉన్న ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.

## హౌజింగ్ బోర్డులో వికసిత్ భారత్



హౌజింగ్ బోర్డులో వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**జహీరాబాద్, జనవరి 17, ప్రభాతవార్త:** పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో బుధవారం వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ఈ సందర్భంగా కాలనీ వాసులకు వివరించారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, పట్టణ అధ్యక్షులు ప్రొద్దుటూరి శ్రీనివాస్ గుప్తా, నాయకులు అప్పం రమేష్, పద్మ, రవికుమార్ శెట్కార్, వీరన్న, వెంకటరామిరెడ్డి, బచ్చా వెంకటేశం, రాణి, డాక్టర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## వెంకటకిష్టాపూర్‌లో అయోధ్య అక్షింతల పంపిణీ



అయోధ్య అక్షింతలను పంపిణీ చేస్తున్న భక్తులు

**చౌటకూరు, జనవరి 17, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెంకటకిష్టాపూర్ గ్రామంలో బుధవారం అయోధ్య అక్షింతల పంపిణి కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఆలయంలో శ్రీరామభక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించి ప్రత్యేక పూజలు నిర్వహించి గడప గడపకు శ్రీరామ నామాన్ని జపిస్తూ వెళ్లి అయోధ్య అక్షింతలను వితరణ చేశారు. ఇండ్ల కాడికి చేరుకున్న రామ భక్తులకు ఇంటి వాసులు మంగళ హారతులతో స్వాగతం పలికారు.

## గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల గడువు పెంపు

**జహీరాబాద్, జనవరి 17, ప్రభాతవార్త:** 2024-25 విద్యా సంవత్సరానికిగాను ఎస్సీ, ఎస్టీ, బిసి గురుకులాల్లో 5వ తరగతిలో విద్యను అందుకునేందుకు దరఖాస్తుల గడువును ఈ నెల 20వ తేదీవరకు పొడగించినట్లు ప్రాంతీయ పర్యవేక్షకులు ఎం.భీమయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 4వ తరగతిలో విద్యను అందుకుంటున్న విద్యార్థులు ప్రవేశాలకు అర్హులన్నారు. ఫిబ్రవరి 11న రాత పరీక్ష నిర్వహించి మెరిట్, రిజర్వేషన్ల ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారన్నారు. పూర్తి వివరాలకు 180042545678 టోల్ ఫ్రీ నంబరును సంప్రదించాలని ఎం భీమయ్య సూచించారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

### ఎమ్మెల్యే సంజీవరెడ్డి



కల్యాణలక్ష్మి చెక్కులను అందచేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, జనవరి 17 ప్రభాతవార్త:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. బుధవారం నారాయణఖేడ్ మండలం జూకల్ శివారులోగల కన్వెన్షన్ హాల్‌లో నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఆయా మండలాలకు చెందిన 233 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కులను ఆయన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలుచేస్తారని అన్నారు. ఉచిత బస్సు పథకంతో మహిళలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీద బడుగు వర్గాలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆదుకుంటుందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ. 5 లక్షల నుంచి రూ.పది లక్షల వరకు పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తొమ్మిది సంవత్సరాలకాలంలో ప్రజలకు ఒక రేషన్‌కార్డూ మంజూరు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల వద్దకే పాలన నిర్వహించి ఆయా గ్రామాల్లోకి అధికారులు మీ వద్దకేవచ్చి దరఖాస్తులను తీసుకుంటున్నారని తెలిపారు. ప్రజాపాలనలో ఇంకా ఎవరైన దరఖాస్తులు చేయకుంటే మీ గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులకు రెండు మూడో రోజుల్లో అందజేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అధికారులు, నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలన్నారు.

ఈకార్యక్రమంలో ఆర్డీఓ ఎన్.నగేష్, తహసీల్దార్ దేవదాస్, ఆర్ఐ శ్యామ్‌రావు, ఆయా మండలాల తహసీల్దార్లు, సర్పంచ్‌లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టిజెఎస్ రాష్ట్రకార్యదర్శి ఆశప్ప మొగుడంపల్లి

## టిజెఎస్ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి

### -టిజెఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆశప్ప మొగుడంపల్లి

**న్యాల్‌కల్, జనవరి 17, ప్రభాతవార్త:** ఈ నెల 21న హైద్రాబాద్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో తెలంగాణ జన సమితి పార్టీ రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆశప్ప మొగుడంపల్లి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రాష్ట్ర సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆశప్ప మొగుడంపల్లి మాట్లాడుతూ రాష్ట్ర సదస్సులో రాష్ట్ర విభజన జరిగి దశాబ్ద కాలం దాటవస్తున్నా విభజన హామీలు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం అయిందని ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీ రెండు మార్లు రాష్ట్రాన్ని పాలించినా తమ స్వంత రాజకీయ ప్రయోజాలకే పరిమితం అయిందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి విభజన హామీలు అమలయ్యేలా చేయాల్సిన అవసరం ఏర్పడిందని, అందుకు రాష్ట్ర సదస్సుకు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి యువత, మేధావులు, ఉద్యమ కారులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆశప్ప మొగుడంపల్లి సూచించారు. కార్యక్రమంలో టిజెఎస్ నాయకులు రాజురెడ్డి, మల్లికార్జున్, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, మహ్మద్ మక్బుల్, నరసింహులుఏ, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పొడిగింపు

### ప్రాంతీయ గురుకుల సమన్వయాధికారి నిర్మల

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** తెలంగాణ సాంఘీక సంక్షేమ ప్రతిభా(సీఓఈ) కళాశాలల్లో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సర ప్రవేశాల పరీక్ష అన్‌లైన్ దరఖాస్తు గడువు ఈనెల 20 వరకు పొడిగించడం జరిగిందని సాంఘీకసంక్షేమ గురుకుల జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి నిర్మల బుధవారం తెలిపారు. మార్చి 2024 విద్యా సంవత్సరంలో పదో తరగతి రాయబోయే విద్యార్థులు పరీక్ష అర్హులని తెలిపారు. విద్యార్థులు గడువులోపు సంబంధిత అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే కళాశాలలో ఐఐటి,నీట్ ప్రవేశ పరీక్షలకు కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని అమె వివరించారు.

## ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**నర్సాపూర్, జనవరి 17 ప్రభాతవార్త :** హైదరాబాద్‌లోని ఎల్లమ్మ బండలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణమని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ, జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల బిక్షపతిచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి కమ్మరి కృపాచారి, పిఎం కౌశిల్ యోజన కన్వీనర్ వెంకటేశ్‌చారి అన్నారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలోని సంఘం కార్యాలయం ఎదుట వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వడ్ల బిక్షపతిచారి మాట్లాడుతూ జయశంకర్ సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసినవారిని వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కమ్మరి కృపాచారి మాట్లాడుతూ తెలంగాణ దశ దిశ చూపిన ఒక గొప్ప మహనీయుని విగ్రహాన్ని కూల్చివేయడం దారుణమని ఇందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. పిఎం కౌశిల్ యోజన కన్వీనర్ వెంకటేశ్‌చారి మాట్లాడుతూ తెలంగాణ రూట్‌మ్యాప్ ఏర్పాటుచేసిన మహా వ్యక్తిని కించపరచడం ఎంత వరకు సమంజసమన్నారు. వడ్ల భాస్కర్‌చారి, పట్టణ అధ్యక్షులు వడ్ల నరేందర్‌చారి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటను వారికి శిక్ష పడేల చూడాల న్నారు. ఈ సంఘటనలు పునరావృతం అయితే ఊరుకునేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం నాయకులు లంగంచారి, సదానంద్‌చారి, ప్రవీణ్‌చారి, నరసింహాచారి, శివచారి, నాగరాజ్‌చారి, శ్రీకాంత్‌చారి, నరేశ్‌చారి తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం నాయకులు



గ్రంథాలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్

### గ్రంథాలయ నిర్మాణ పనులు

## యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి

### సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

**హుస్నాబాద్ రూరల్, జనవరి 17, ప్రభాతవార్త :** హుస్నాబాద్‌లో గ్రంథాలయ భవన నిర్మాణ పనులను సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మార్చిలోగా భవన నిర్మాణాన్ని పూర్తి చేసి అప్పగించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపు ఎలాంటి ఇబ్బందులు లేవని తనచేతిలోనే బిల్లులు మంజూరు చేస్తానని కాంట్రాక్టర్‌కు సూచించారు. గ్రంథాలయంకు దక్షిణ వైపు సైతం రహదారిని ఏర్పాటు చేయడం వలన స్థానికులకు ఇబ్బంది ఉందని గ్రంథాలయానికి నేరుగా చేరుకోవచ్చని అటు వైపు ప్రత్యేకంగా గేటును ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ భవన నిర్మాణ పనులు ఎలా జరుగుతున్నాయని అంటూ కమిషనర్ ఎంఆర్ రాజశేఖర్‌ను ప్రశ్నించగా పనులు దగ్గర పడ్డాయని అదనపు కలెక్టర్‌కు వివరించారు. అమె వెంట అధికారులు తదితరులు ఉన్నారు.

## అయోధ్య ఉత్సవం అద్భుతం

### - అరవింద్‌కు ఆహ్వానం గౌరవం

**సిద్దిపేట రూరల్, జనవరి 17, ప్రభాతవార్త:** ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్న అయోధ్య రామాలయ ప్రాణ ప్రతిష్ట ఉత్సవం అద్భుతమని టిఎన్జీవోస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు, అమర్‌నాథ్ సేవా సమితి నాయకులు గ్యాదరి పరమేశ్వర్ అన్నారు. సిద్దిపేట వ్యాస మహర్షి యోగ కేంద్రంలో బుధవారం అయోధ్య రామ మందిర్ ఉత్సవానికి ప్రత్యేక ఆహ్వానితునిగా ఎంపికైన ప్రముఖ వైద్యులు అరవింద్ అభినందన సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ అరవింద్ శ్రీరామ క్షేత్ర ట్రస్టు వారిచే సిద్దిపేట జిల్లా నుంచి ప్రత్యేకంగా అహ్వానింపబడడం గర్వకారణం అన్నారు. ఏ రంగంలో నైనా సిద్దిపేట జిల్లా తన ప్రత్యేకతను నిలుపుకుంటుందని చెప్పారు. అయోధ్య రామాలయ ప్రాణ ప్రతిష్ట ఉత్సవంలో దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు, ప్రతినిధులకు అన్నదానం చేసే మంచి అవకాశం అమర్‌నాథ్ సేవా సమితికి లభించిందని తెలిపారు. సీనియర్ పాత్రికేయులు అంజయ్య, సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తోట అశోక్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యాస మహర్షి యోగ సొసైటీ గౌరవ చైర్మన్ డాక్టర్ అరవింద్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షులు నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, యోగ శిక్షకులు తోట సతీష్, తోట సంధ్య, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు రఘువరన్‌రెడ్డి, టిపియుఎస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్‌రెడ్డి, యుటిఎంఎ రాష్ట్ర అధ్యక్షులు లక్కిరెడ్డి విజయశుబాకర్‌రెడ్డి, అంబిటాస్ పాఠశాల చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, న్యాయవాది శివాజీ, యోగా అసోసియేషన్ ప్రతినిధులు చిప్ప ప్రభాకర్, రాజమల్లు, శ్రీనివాస్, కుమార్, లింగమూర్తి, శారద, హరిప్రసాద్ పాల్గొన్నారు.



డాక్టర్ అరవింద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

# అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

### కంగ్టి మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**కంగ్టి, జనవరి 17 ప్రభాతవార్త:** అధికారులు నాయకులు కలిసి సమన్వయంతో పనిచేయాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. బుధవారం కంగ్టి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ సంగీత వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఎమ్మెల్యే పి. సంజీవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఆయా శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ ఏ ఇబ్బందులకు లేకుండా చూడాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో మండలంలో ఏ గ్రామానికీ తాగునీటి సమస్య రాకుండా చూడాలని అధికారులకు, ఏఈకి సూచించారు. ఏమైన సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు ఆయా శాఖల అధికారులు తెలియజేయాలని కోరారు.

**కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత...**

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. బుధవారం కంగ్టిలోని ఎంపీపీ ఆవరణలో ఆయా గ్రామాలకు చెందిన 58 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను ఆయన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల సంక్షేమానికి ఆరు గ్యారెంటీల పథకం ప్రవేశపెట్టారని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని ఎవరూ భయపడాల్సిన పనిలేదన్నారు. ఎవైనా పెండింగ్‌లో కల్యాణలక్ష్మి చెక్కులు ఉంటే వారంరోజుల్లో మంజూరు చేస్తామన్నారు. దళారులకు నమ్మి మోస పోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ముజఫరుద్దీన్, తహసీల్దార్ విద్యసాగర్, డిప్యూటీ తహసీల్దార్ జుబేర్ ఆహ్మద్, ఆర్ఐ లక్ష్మణ్, జడ్పీ టీసీ కోట లలిత, కోట ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ మారుతిరెడ్డి, సర్పంచ్‌లు పల్లవిపరశురాం, సురేఖ వెంకట్, మాజీజడ్పీటీసీ సర్దార్‌నాయక్, పాల్గొన్నారు.

## సింగూరు కాలువను పరిశీలించిన ఇఇ

### గండ్లను పూడ్చివేయించిన ఇరిగేషన్ ఇఇ మధుసూధన్‌రెడ్డి

**జోగిపేట, జనవరి 17, ప్రభాతవార్త:** సింగూరు కాలువలను ఇరిగేషన్ ఇఇ మధుసూధన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. సింగూరునుంచి నీటిని వదిలిన సందర్భంగా కాలువల పరిస్థితిన ఆయన పరిశీలించారు. చందంపేట నుంచి సాయిబాన్‌పేట వరకు ఉన్న కాలువకు పలు చోట్ల గండ్లు పడటంతో వాటిని ఆయన పరిశీలించి మరమ్మతులు చేయించారు. సాగుకోసం వదిలిన నీరు వృధాకాకుండా స్థానిక అధికారులు పర్యవేక్షిస్తుండాలని, ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తిని వెంటనే అసరమైన చర్యలు చేపట్టాలని కిందిస్థాయి అధికారులకు ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయనవెంబడి డిఇఇ విక్రమ్, ఎఇఇ మజర్, వర్క్ఇన్స్‌పెక్టర్ నాగరాజులు ఉన్నారు.

## రుద్రారంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు



విద్యుత్ స్తంభాల ఏర్పాటును పరిశిలిస్తున్న సర్పంచి లక్ష్మణ్

**చిన్నశంకరంపేట, జనవరి 17,ప్రభాతవార్త:** మండల పరిధి రుద్రారంలో బుధవారం సర్పంచి లక్ష్మణ్ ,ఏఈ సతీష్ బాబు సహకారంతో విద్యుత్తు స్తంబాలను ఏర్పాటు చేయించారు. కొన్నిరోజులుగా గ్రామంలో 18 విద్యుత్తు స్తంబాలు శిథిలావస్థకు చేరాయని ఏఈ సతిష్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన జిల్లా అధికారులతో మాట్లాడి స్తంభాలను మంజూరు చేయించినట్లు ఆయన వివరించారు. కాంట్రాక్టర్ శ్రీనివాస్ శిథిలావస్థకు చేరిన స్తంబాలను తొలగించి కొత్తవి బిగించారు.

## శబరిమలై తరలిన అయ్యప్ప స్వాములు

**జోగిపేట, జనవరి 17, ప్రభాతవార్త:** అయ్యప్ప దీక్ష చేపట్టిన పలువురు స్వాములు శబరిమలై వెళ్తున్న సందర్భంగా హౌసింగ్‌బోర్డులోని అయ్యప్ప ఆలయంలో గురుస్వాముల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి స్వాములకు ఇరుముడులు వేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, డిసిసిబి మాజీ జిల్లా ఉపాధ్యక్షులు జైపాల్‌రెడ్డి, ఎంపిపి బాలయ్యలు పాల్గొన్నారు. పూజల అనంతరం దీక్షచేపట్టిన అయ్యప్పస్వాముల శబరిమలైకి తరలివెళ్లారు. కార్యక్రమాలకు కుటుంబసభ్యులతోపాటు భక్తులు హాజరయ్యారు.

## ఈశ్వర్ మందిరాన్ని పరిశుభ్రం చేసిన రాజు

**సదాశివపేట, జనవరి 17, ప్రభాతవార్త:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు బుధవారం పట్టణంలోని ఈశ్వర్ మందిర పరిసరాలను భారతీయ జనతా పార్టీ నేత, పిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ పులిమామిడి రాజు పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ ఈ నెల 22న ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్యలో శ్రీరామ ప్రాణప్రతిష్టను పురస్కరించుకుని ప్రజలు స్వచ్ఛ తీర్ధ ప్రచారంలో భాగంగా పరిసరాల్లోని ఆలయాలను పరిశుభ్రం చేయాలని ప్రధానమంత్రి సూచించారని, అందులో భాగంగా ఈశ్వర్ మందిరాన్ని బుధవారం పరిశుభ్రం చేశానన్నారు. ఆలయంలో అర్చకులు వేదమంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు,పిఎంఆర్ యువసేన నాయకులు అనిల్, హరీష్, గుణాకర్, సోమశంకర్, వెంకట్, చిన్న, సాయి, నందు, బస్వరాజ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## యాచకుడికి అంత్యక్రియలు

**పటాన్‌చెరు, జనవరి 17,ప్రభాతవార్త:** పట్టణంలోని ఓ యాచకుడు మృతి చెంది మూడు రోజులైనా సంబంధించిన వాళ్లు ఎవరూ రాకపోవడతో యండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ పృథ్వీరాజ్ ఆర్థిక సహాయం అందించగా యండీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు.

## అర్హులు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలి

### తహసీల్దార్ రవీందర్





ఓటరు నమోదు ర్యాలీని ప్రారంభిస్తున్న తహసీల్దార్ రవీందర్, సిఐ రాజు

**జహీరాబాద్, జనవరి 17, ప్రభాతవార్త:** 18 సంవత్సరాలు నిండిన అర్హులైనవారు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రవీందర్, సిఐ బి.రాజు పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలోని ఆయాశాఖల అధికారుల ఆధ్వర్యంలో ఓటరు నమోదు ర్యాలీని తహసీల్దార్, సిఐలు ప్రారంభించి ప్రసంగించారు. ఈ నెల 22వ తేదీలోగా నూతన ఒటర్లు తమ ఓటు హక్కును నమోదు చేసుకునే అవకాశం ఉందని, అందుకు అర్హులైన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటు హక్కు నమోదు కొరకు ఫారం 6ను, మార్పులు చేర్పుల కొరకు ఫారం 8ని వినియోగించి పోలింగ్ కేంద్రాల్లో బిఎల్ఓలకు అందచేయాలని సూచించారు. కార్యమ్రంలో ఎస్ఐలు కే శ్రీకాంత్, ప్రసాద్‌రావు, రెవిన్యూ సిబ్బంది, అంగన్‌వాడి టీచర్లు, డ్వాక్రా గ్రూపు మహిళలు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మహిళ మృతి

**సంగారెడ్డి టౌన్, జనవరి 17, ప్రభాతవార్త:** ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన బుధవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో చోటు చేసుకుంది. ఇందుకు సబంధించి పోలీసుల కథనం ప్రకారం... ఈ నెల 8న జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోకి ఆసుపత్రికి ఓ మహిళ చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరి తన పేరు ఎర్రోళ్ల బూదమ్మ (50) అని, తమ గ్రామం ఫల్దీవాడ ఫతేనగర్ బాలాపూర్ హైద్రాబాద్ అని తెలపి ఆసుపత్రిలో చికిత్స అందుకుంటోందన్నారు. ఈ నెల 17న ఆసుపత్రిలో చికిత్స అందుకుంటూ ఉదయం 8.15 గంటల ప్రాంతంలో తిరిగిరాని లోకాలకు చేరిపోయిందన్నారు. సంగారెడ్డిలోని శ్రీనగర్‌క చెందిన దమ్మగోని శ్రవణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ యన్ శ్రీధర్‌రెడ్డి వివరించారు.

## లారీ కారు ఢీ.. బ్యాంక్ ఉద్యోగి మృతి

**జహీరాబాద్, జనవరి 17, ప్రభాతవార్త:** లారీ కారు ఢీకొన్న సంఘటనలో ఎస్‌బిఐ ఉద్యోగి మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలోని గౌసబాద్ వద్ద జరిగింది. చిరాగ్‌పల్లి ఎస్ఐ నరేష్ కుమార్ కథనం ప్రకారం... కర్నాటకలోని చించోలి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్‌లో పి చేస్తున్న మనిదీప్ హైద్రాబాద్ నుంచి చించోలి వైపు వెళుతుండగా మండలంలోని గౌసబాద్ వద్ద ఎదురుగా వస్తున్న లారీ మణిదీప్ ప్రయాణిస్తున్న కారును ఢీకొనడంతో ప్రమాదంలో మణదీప్ అ్కడికి అక్కడే మృతి చెందాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు